## రెండు తలలతో లేగదూడ జననం



నారాయణ ఖేడ్, నవంబర్ 18: నారాయణ ఖేడ్ మండలం అనంతసాగర్‌లో రైతు సాయిరెడ్డికి చెందిన బర్రెకు రెండు తలలు, ఆరు కాళ్లతో దూడ జన్మించింది. కొన్ని గంటల తర్వాత ఆ దూడ మరణించింది. రెండు తలలు, ఆరు కాళ్లతో వింతగా కనిపిస్తున్న దూడను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సాయిరెడ్డి ఇంటికి తరలివచ్చారు.

## నేడు ఉపాధి హామీ పనులపై ప్రజాదర్బార్

జహీరాబాద్, నవంబర్ 18: ఉపాధి హామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీపై మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు న్యాల్‌కల్ మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్, ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి రంగారావు తెలిపారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కూలీలు తదితరులు విధిగా హాజరుకావాలని సూచించారు.

## ఆర్థిక ఇబ్బందులతో దుకాణాదారుడి ఆత్మహత్య

అందోల్, నవంబర్ 18: ఆర్థిక ఇబ్బందులతో కిరాణం నడిపించే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగిపేటలో సోమవారం చోటుచేసుకుంది. టేక్మాల్ మండలం దన్నారం గ్రామానికి చెందిన నర్సింహులు(55) జోగిపేటలో ఏండ్లుగా కిరాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దుకాణం నిర్వహణ, కూతుర్ల పెండ్లికి, ఇతరత్రా అవసరాలకు అప్పులు చేశాడు. ఓ వైపు అప్పులు పెరిగిపోవడం, మరో వైపు వ్యాపారం సరిగా నడవక అప్పులు తీర్చే మార్గం లేక పోవడంతో ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి అన్నాసాగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం చెరువులో మృతదేహాన్ని చూసిన స్థానికులు కుటుంబ సభ్యులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు.

## రుణాలు వసూలు చేయాలి

కోహీర్, నవంబర్ 18: స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా అందించిన రుణాలను వసూలు చేయాలని ఐకేపీ ఏపీఎం సమ్మయ్య ఆదేశించారు. సోమవారం కోహీర్ పట్టణంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఆయా గ్రామాల డ్వాక్రా సంఘాల సీఏలు, వీవోఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించిన సంఘాలకు మాత్రమే మరోసారి మంజూరు చేయించాలని సూచించారు. రికార్డులను సక్రమంగా నమోదు చేయాలన్నారు.

## సకాలంలో వైద్యసేవలు అందించాలి

కోహీర్, నవంబర్ 18: వైద్య సిబ్బంది తమ విధులు సక్రమంగా నిర్వహించాలని వైద్యాధికారి డాక్టర్ లియోనా ఆదేశించారు. సోమవారం మండలంలోని బిలాల్‌పూర్ పీహెచ్‌సీలో పలు గ్రామాల ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌ను వినియోగించాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొల్లారం, నవంబర్ 18: బొల్లారం పారిశ్రామిక వాడలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ మాధవరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొల్లారం సబ్‌స్టేషన్ 3 పరిధిలో ఎల్‌వీ -2 ఫీడర్లు మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పారిశ్రామికవాడతో పాటు పాత బొల్లారంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామికవేత్తలు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## ఎస్టీ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలి

నారాయణఖేడ్, నవంబర్ 18: ఎస్టీ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్ సోమవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ శరత్‌ను కోరారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరైనప్పటికీ కార్పొరేషన్‌లో నిధులు లేవనే కారణంతో లబ్ధిదారులకు లబ్ధి చేకూరడం లేదన్నారు.



గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్‌తో మాట్లాడుతున్న రవీందర్‌నాయక్

# సదా సమాజ సేవలో..

- ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
- ఖాజీపల్లి అభివృద్ధికి చర్యలు
- గ్రామాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు
- ప్రజల కోసం వైద్య శిబిరాలు, ఉచితంగా ఆపరేషన్లు



మరమ్మతులతో బాగైన ఖాజీపల్లి-బొల్లారం రోడ్డు



దండే రమాకాంత్

జిన్నారం, నవంబర్ 18: సమాజ సేవే లక్ష్యంగా ఆర్‌కే ఫౌండేషన్ ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు చేపడుతున్నారు దండే రమాకాంత్. ఖాజీపల్లి గ్రామానికి చెందిన దండే రమాకాంత్ వృత్తిరీత్యా న్యాయవాది. తాను పుట్టి పెరిగిన గ్రామానికి, ప్రజలకు చేతనైన సాయం చేయాలనే ఉద్దేశంతో ఆర్‌కే ఫౌండేషన్‌ను స్థాపించాడు. తాను చిన్నప్పుడు చూసిన ఖాజీపల్లి పరిశ్రమలు వదిలే కాలుష్యం, పొగతో ఉక్కిరిబిక్కిరవుతుందని గుర్తించి కాలుష్య రహిత గ్రామంగా మార్చేందుకు ప్రత్యేక జేఏసీ ఏర్పాటు ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో కలిసి పోరాటాలు చేశారు. ప్రజలు అనారోగ్యాలకు గురవుతుండడంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా సేవలందించారు. ఖాజీపల్లి, జీఎంఆర్ కాలనీలో కంటి



జీఎంఆర్, జర్నలిస్టు కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న బస్ షెల్టర్

వైద్య శిబిరం ఏర్పాటు చేసి 25 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. ఒకరికి గుండె ఆపరేషన్, మరొకరికి భుజం ఆపరేషన్ ఉచితంగా చేయించారు. వీటితో ఆగకుండా బొల్లారం నుంచి ఖాజీపల్లికి వచ్చే రోడ్డు గుంతలు తేలడంతో వైట్‌మిక్స్ వేయించి మరమ్మతులు చేయించి రాకపోకలను సుగమం చేశారు. జీఎంఆర్, జర్నలిస్టు కాలనీ రోడ్డును బాగు చేయించి రోడ్డు ప్రధాన మార్గంలో డివైడర్, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టారు. ఇదే కాలనీలో బస్ షెల్టర్ నిర్మిస్తున్నారు. ఇదంతా సొంత ఖర్చుతోనే చేస్తున్నట్లు రమాకాంత్ తెలిపారు. ఖాజీపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఖాజీపల్లి గ్రామానికి, జీఎంఆర్, జర్నలిస్టు కాలనీలకు బస్సులు వచ్చేలా చేశారు. ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని చెప్పారు.

### తండ్రి స్ఫూర్తితో సేవలు

దండే రమాకాంత్ జడ్పీ మాజీ చైర్మన్ రామకృష్ణ కుమారుడు. ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రామకృష్ణ ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా 1986 నుంచి 1991 వరకు పని చేశారు. తండ్రికి ఉన్న గౌరవం, గుర్తింపు, ఆయన చేసిన సేవల నుంచి ప్రేరణ పొంది పుట్టి, పెరిగిన సొంత గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో ఆర్‌కే ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు రమాకాంత్ తెలిపారు. శుద్ధమైన తాగు నీరు, ఖాజీపల్లిలో బస్‌డిపో, టీటీడీ కల్యాణ మండపం, వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రం, సీసీ రోడ్లు, డ్రైనేజ్ మాస్టర్ ప్లాన్, సోలార్ వీధి లైట్ల ఏర్పాటుకు ఆర్‌కే ఫౌండేషన్ పని చేస్తుందన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో కూడా తన సేవా కార్యక్రమాలు మొదలవుతాయని, త్వరలోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని తెలిపారు.

## పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



మామిడి మొక్కను నాటి నీరు పోస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సదాశివపేట, నవంబర్ 18: మండల పరిధిలోని నిజాంపూర్(కె) పాఠశాలను డీఈవో వెంకటేశ్వర్లు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టీచింగ్ మెటీరియల్, పాఠశాల రికార్డులను పరిశీలించారు. దాతలు విరాళంగా ఇచ్చిన టై, బెల్టులను విద్యార్థులకు అందజేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించి మామిడి మొక్క నాటి నీరు పోశారు. ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అన్ని రకాల రికార్డులను పారదర్శకంగా నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అభినందించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు డీఈవోను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్, ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు సునీత, నవనీత, సీఆర్పీ నగేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి



దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ అపర్ణాశివరాజ్ పాటిల్

సదాశివపేట, నవంబర్ 18: బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణాశివరాజ్‌పాటిల్ అన్నారు. సోమవారం పట్టణంలోని బంగారు మైసమ్మ ఆలయ దుకాణ సముదాయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చైర్‌పర్సన్ అపర్ణాశివరాజ్‌పాటిల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్, ఖలీంపటేల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి ఎన్నం మల్లేశం, కోశాధికారి అంబటి విశ్వనాథం, రవీందర్, వెంకటేశం, కృష్ణ పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

అమీన్‌పూర్, నవంబర్ 18: మండల పరిధిలోని జానకంపేట గ్రామంలో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పాండుయాదవ్, సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ రాజు, సీనియర్ నాయకులు తులసి రెడ్డి, కొల్లూరి యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహా పడిపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

## మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

**అనుమతులున్నాయని వదిలిపెట్టిన రెవెన్యూ అధికారులు**



డాకూర్ గ్రామస్తులు అడ్డుకున్న టిపర్ల వద్ద వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

అందోల్, నవంబర్ 18: మండల పరిధిలోని డాకూర్ శివారులో మట్టిని తరలిస్తున్న టిప్పర్లను సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. నిత్యం అక్రమంగా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని తెలిపారు. టిప్పర్లు మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. గత నెలలో మేకల మందపై నుంచి టిప్పర్ వెళ్లడంతో మేకలు చనిపోయాయని, ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో వాహనాల్లో మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. అనంతరం అక్కడికి చేరుకున్న రెవెన్యూ అధికారులు వాహనాల డ్రైవర్లతో మాట్లాడారు. మట్టి తరలింపునకు అనుమతులున్నాయని పేపర్లు చూపించడంతో టిప్పర్లను పంపించినట్లు డీటీ మధుకర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ అనుమతులు తీసుకున్నా నిబంధనలు పాటించకుండా మట్టి, మొరం తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ప్రైవేట్ వెంచర్లకు పదుల సంఖ్యలో టిప్పర్లతో రాత్రి పగలు తేడాలేకుండా మొరం తరలిస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.

## పత్తి కొనుగోళ్లు ప్రారంభం

నారాయణఖేడ్, నవంబర్ 18: నారాయణఖేడ్ మండలం పైడిపల్లి శివారులోని లక్ష్మీ జిన్నింగ్ మిల్లులో సోమవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పత్తి పండిస్తున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారుల వల్ల రైతులు నష్టపోవద్దనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు.



పత్తి కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

## సిద్ధివినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు



రేజింతల్ సిద్ధివినాయకుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

జహీరాబాద్, నవంబర్ 18: న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయం భక్తులతో సందడిగా మారింది. కార్తిక సోమవారంతోపాటు సంకష్టహర చతుర్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో అర్చకుల మంత్రోచ్ఛరణలు.. భోలో సిద్ధివినాయక మహారాజ్‌కీ జై అంటూ భక్తుల నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అర్చకులు ఆలయంలో స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, గణేశ హోమం, హారతి తదితర పూజలు నిర్వహించారు. ఈ సంకష్టహర చతుర్థి వేడుకలకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో సిద్ధి, బుద్ధి సామేత వినాయకుడి కల్యాణోత్సవం కనుల పండువుగా నిర్వహించారు. మండలంలోని హద్నూర్ వరసిద్ధి వినాయక ఆలయం, చీకూర్తి గ్రామంలోని సిద్ధివినాయక ఆలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కార్తిక దీపోత్సవం కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరించిన బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, నవంబర్ 18: భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ కమ్యూనిటీ హాల్‌లో మూడు రోజులపాటు జరగనున్న కార్తిక దీపోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని నియోజకవర్గ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం నిర్వాహకుడు ప్రకాశ్ పంతులు ఆదర్శ్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆయన చేతుల మీదుగా కరపత్రాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ లోకకల్యాణార్థం భారతీనగర్‌లో మూడు రోజులపాటు ఈ వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉన్నదన్నారు. అనంతరం ప్రకాశ్ పంతులు మాట్లాడుతూ శివ కేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తికమాసంలో లోక కల్యాణార్థం భక్తులకు శుభాలు కలుగాలని ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖేశ్, రవి, రాజు, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలు నారాజైతే మేము కుర్చీ దిగాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

కొండాపూర్,నవంబర్18: కాంగ్రెస్ కార్యకర్తలు నారాజ్ అయితే నాయకులుగా మేము కుర్చీ దిగాల్సిందేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని మల్కాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించే బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీసుకుంటారన్నారు. ప్రతి కార్యకర్త నారాజ్ కాకుండా ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. 60 ఏండ్ల ఆకాంక్షను సోనియాగాంధీ గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. మహాలక్ష్మి పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3600 కోట్లు కేటాయించిందన్నారు.మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉన్న స్వేచ్ఛ ఏ పార్టీలో ఉండదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మాలా జగ్గారెడ్డి, టెస్కా కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నీలం మధు, గాలి అనిల్‌కుమార్, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## పట్టపగలే పరిశ్రమల ఘన వ్యర్థాల కాల్చివేత



బొల్లారం పారిశ్రామికవాడలో వ్యర్థాలు కాల్చి వేయడంతో కమ్ముకున్న పొగ

బొల్లారం, నవంబర్ 18: విచ్చలవిడిగా రసాయన పరిశ్రమల ఘన వ్యర్థాలను తరుచూ కాల్చివేయడంపై పారిశ్రామిక వాడ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం బొల్లారం పారిశ్రామికవాడలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున పోగుచేసిన రసాయన ఘన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చివేశారు. దీంతో భారీ స్థాయిలో దట్టమైన నల్లని పొగలు ఆవరించడంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పరిశ్రమల యాజమాన్యాలు చాలాసార్లు ఇలా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మంజీరా పైప్ లైన్ లీకేజీ



బొల్లారం, నవంబర్ 18: బొల్లారం పారిశ్రామికవాడలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే మరోవైపు మంజీరా పైప్ లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతున్నది. పారిశ్రామికవాడలోని హనుమాన్ ఆలయం నుంచి జెనెక్స్ పరిశ్రమకు వెళ్లే దారి పక్కన మంజీరా పైప్ లైన్ లీకై రెండు రోజులుగా నీరు వృథాగా పోతున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు

## హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నేతలు

మునిపల్లి, నవంబర్ 18: సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును హైదరాబాద్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు నెరవేర్చే వరకు ప్రజలతో మమేకమై ఉండాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో తాటిపల్లి ఉప సర్పంచ్ అంజన్న, నాయకులు బక్కారెడ్డి, మల్లేశం, నర్సింహారెడ్డి, చిన్న కృష్ణ, పెద్ద నర్సింహారెడ్డి, పెద్ద కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రాజురెడ్డి, సికిందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, నర్సింహారెడ్డి, చిన్న శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు రహుల్‌విశ్వకర్మ, సరిత

జహీరాబాద్, నవంబర్ 18: యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏరువాక కేంద్రం సంగుపేట్ శాస్త్రవేత్తలు రహుల్‌విశ్వకర్మ, సరిత అన్నారు. సోమవారం మొగుడంపల్లి మండల పరిధిలోని ధనసిరి గ్రామంలోని రైతు వేదికలో రైతులకు యాసంగి సీజన్‌కు ఏడీబీడీ-2 రకం శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ఎండు తెగులును సమర్థవంతంగా ఎదుర్కొంటుందన్నారు. అనంతరం రంజోల్ గ్రామంలో ఆ యిల్‌పామ్ పంటను పరిశీలించారు. పంటకు ఆశించిన కొమ్మ పురుగు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గిలో మామిడి తోటకు ఆశించిన గూడు కట్టు పురుగు నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, ఏరువాక కేంద్రం వైపీ-1 శ్రీకాంత్ పాల్గొన్నారు.

## 'చలో లగచర్ల'ను విజయవంతం చేయాలి

హత్నూర, నవంబర్ 18: లగచర్ల గిరిజన బాధితుల పరామర్శకు బుధవారం నిర్వహించ తలపెట్టిన చలో లగచర్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు రవీందర్‌నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ లగచర్ల రోటిబండ తండా, పులిచర్ల తండా, గడ్డమీది తండా, ఈదులకుంట తండా, మైసమ్మగడ్డ తండాల గిరిజన బాధితుల సమస్యలు తెలుసుకోవడానికి చలో లగచర్ల కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అకారణంగా ఎస్టీ రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాజ్యాంగబద్ధంగా పోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. ప్రభుత్వం రాజకీయ లబ్ధికి లంబాడాలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆరోపించారు. చలో లగచర్ల కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా తరలి వెళ్లనున్నందున హత్నూర మండలం నుంచి పెద్ద ఎత్తున గిరిజన నాయకులు, యువకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## ఖేడ్‌లో ఘనంగా కనకదాస్ జయంతి



నివాళి అర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

నారాయణఖేడ్, నవంబర్ 18: నారాయణఖేడ్‌లో సోమవారం స్థానిక కురుమ సంఘం ఆధ్వర్యంలో కనకదాస్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. పట్టణంలోని భోంగొండేశ్వర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భక్త కనకదాస్ చిత్రపటానికి పూజలు చేసి వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం సంఘం బాధ్యులు మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తెచ్చేందుకు కనకదాస్ చేసిన కృషి ఎనలేనిదని గుర్తుచేశారు. ప్రతిఒక్కరూ కనకదాస్ బోధనలను అనుసరించి నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంజీవులు, సాయిలు, మల్‌గొండ, ఓంప్రకాష్, నగేష్, నర్సింహులు, జైపాల్, భీమన్న, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సిర్గాపూర్, నవంబర్ 18: మండలంలోని చీమల్‌పాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఏసప్ప ఆదివారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గ్రామంలో కార్యకర్త పార్థివదేహానికి పూలు సమర్పించి నివాళి అర్పించారు. ఈమేరకు కుటుంబీకులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు బస్వరాజ్ పాటిల్, కుమార్, రాజు, సరేందర్ ఉన్నారు.

***మాసాన్‌పల్లిలో..***

కల్హేర్, నవంబర్ 18: మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రామ్మోహన్ మాతృమూర్తి మృతి చెందడంతో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ దిలీప్ కుమార్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నారాయణరావు, సుధాకర్, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల రాకపోకలకు ఆటోలు ఏర్పాటు



ఆటోలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, నవంబర్ 18: సర్కారు బడిలో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు బీఆర్ఎస్ నేత అండగా నిలిచి ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. సోమవారం గుమ్మడిదలకు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సర్కారు బడిలో చదివే విద్యార్థుల రాకపోకల కోసం ఆటోలను ఏర్పాటు చేశారు. మండలంలోని మంభాపూర్‌లో ఐదో తరగతి వరకు చదివిన పిల్లలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుమ్మడిదలలో చదువుకుంటున్నారు. మంభాపూర్-గుమ్మడిదలకు నాలుగు కిలోమీటర్ల దూరం ఉంది. వీరు నిత్యం కాలినడక వెళ్తుండడంతో గ్రామస్తులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని కలిసి ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. వెంటనే ఆయన సొంత నిధులతో రెండు ఆటోలను ఏర్పాటు చేశారు. ఈ ఆటోలను సోమవారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కంజర్ల శ్రీనివాస్, ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, గౌరీశంకర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, భాస్కర్, మల్లేశ్‌గౌడ్, చంద్రారెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

***ఆర్థికసాయం అందజేత***

అనారోగ్యంతో బాధ పడుతున్న వ్యక్తికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్థిక సాయమందించారు. సోమవారం మండలంలోని మంభాపూర్ గ్రామానికి చెందిన నీరుడి పెంటయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు అందించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కంజర్ల శ్రీనివాస్, ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, దోమడుగు శంకర్, నాయకులు దేవేందర్‌రెడ్డి, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, గౌరీశంకర్‌గౌడ్, మొగులయ్య, తుపాకుల రాజు, సత్యనారాయణ, భాస్కర్, దయానంద్, ప్రకాశ్ ఉన్నారు.